సాక్షి
వైఎస్ఆర్ జిల్లా
మంగళవారం। 13 । ఫిబ్రవరి । 2024



పుట్టా బంధువులా.. మజాకా
వివాదాస్పద స్థలంలో తమ బంధువులు నిర్మించనున్న విల్లాస్ నిర్మాణానికి టీడీపీ నేత పుట్టా సుధాకర్ యాదవ్ భూమి పూజ చేయడం చర్చనీయాంశంగా మారింది. -8లో



మాస్టర్ కీతో బైక్‌ల మాయం
అతని కన్ను పడితే బైక్ మాయం కావాల్సిందే. ఒకటి కాదు.. మాటు వేసి తన వద్ద ఉన్న మాస్టర్ కీ సాయంతో 21 ద్విచక్ర వాహనాలను దొంగలించాడు. -8లో

వాతావరణం
గరిష్టం/కనిష్టం
34.6/19.3
జిల్లాలో సోమవారం 19.3 – 34.6 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 3.7 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
- కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

నిరుద్యోగ యువతకు శిక్షణ

కడప కోటిరెడ్డిసర్కిల్: కీడ్స్ ట్రస్టు ఆధ్వర్యంలో నందిగామలో హెల్త్‌కేర్ కౌన్సిరల్ కో ఆర్డినేటర్ కోర్సులో ఉచిత శిక్షణ ఇవ్వనున్నామని సెంటర్ ఇన్‌ఛార్జి హరిప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. డిగ్రీ పాస్, పీజీ పాస్/ఫెయిల్ అభ్యర్థులు ఇందుకు అర్హులన్నారు. 19–30 సంవత్సరాల మధ్య వయస్సు కలిగి ఉండాలన్నారు. 60 రోజులపాటు శిక్షణ ఉంటుందని, శిక్షణా కాలంలో ఉచిత వసతి, భోజన సౌకర్యం కల్పిస్తామన్నారు. ఈనెల 17వ తేదిన బ్యాచ్ ప్రారంభమవుతుందని, ఆసక్తిగల అభ్యర్థులు 90004 87423 నంబరులో సంప్రదించాలన్నారు.

యువతకు ఉపన్యాస పోటీలు

వైవీయూ: పార్లమెంట్ భవనంలో జరిగే జాతీయ యూత్‌పార్లమెంట్ ఫెస్టివల్–2024 కార్యక్రమంలో భాగంగా పార్లమెంట్‌లో ప్రసంగించే అవకాశం కోసం ఉపన్యాస పోటీలు నిర్వహిస్తున్నట్లు నెహ్రూ యువకేంద్రం జిల్లా అధికారి కె. మణికంఠ తెలిపారు. వైఎస్ఆర్ కడప జిల్లా, అన్నమయ్య జిల్లాలోని 18 నుంచి 25 సంవత్సరాల మధ్య వయస్సు గల యువత ఈ పోటీల్లో పాల్గొనవచ్చన్నారు. 'యంగ్ వాయిసెస్ : ఎంగేజ్ అండ్ ఎంపవర్ ఆఫ్ నేషన్స్ ట్రాన్స్‌ఫార్మేషన్' అన్న అంశంపై ఉపన్యాస పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈనెల 17వ తేదీ శనివారం ఆన్‌లైన్ వర్చువల్ విధానంలో జరుగుతుందని తెలిపారు. జిల్లాస్థాయి విజేతలు రాష్ట్రస్థాయి, జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుందని తెలిపారు. ఆసక్తి గల యువత తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు 9177616677 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

కడపలో ఐసీడీఎస్ ఆర్‌జేడీ పర్యటన



మాట్లాడుతున్న రోహిణి

కడప కోటిరెడ్డిసర్కిల్: కడపలోని ఐసీడీఎస్ ప్రాంతీయ సంయుక్త సంచాలకులు(ఆర్‌జేడీ) రోహిణి పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె సీకేదిన్నె ఐసీడీఎస్ ప్రాజెక్టును పరిశీలించి సూపర్‌వైజర్లు, అంగన్వాడీ కార్యకర్తలు, కార్యాలయ సిబ్బందితో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం పోషణ్ అభియాన్, వన్‌స్టాప్ సెంటర్, బాలల పరిరక్షణ విభాగం, గృహ హింస విభాగాలపై సిబ్బందికి సూచనలు చేశారు. శాఖాపరంగా ప్రభుత్వం చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం సకాలంలో అందేలా చూడాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పీడీ శ్రీలక్ష్మి, డీసీపీఓ సుభాష్ యాదవ్, వన్‌స్టాప్ సెంటర్ అడ్మినిస్ట్రేటర్ అశ్విని, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పీజీ డిప్లొమో కోర్సుల్లో ప్రవేశాలు

వైవీయూ: యోగివేమన విశ్వవిద్యాలయం జర్నలిజం, ఫైన్‌ఆర్ట్స్ విభాగాల్లోని పీజీ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలకు ఈనెల 13 నుంచి 20వ తేదీ వరకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు ప్రవేశాల సంచాలకులు డా. టి. లక్ష్మీప్రసాద్ తెలిపారు. జర్నలిజం శాఖ ఆధ్వర్యంలో పీజీ డిప్లొమా ఇన్ పబ్లిక్ రిలేషన్, పీజీ డిప్లొమా ఇన్ తెలుగు జర్నలిజం, లలితకళల విభాగం ఆధ్వర్యంలో పీజీ డిప్లొమా ఇన్ థియేటర్ ఆర్ట్స్ కోర్సులకు ప్రవేశాల కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. యేడాది కాలం (రెండు సెమిస్టర్లు) గల ఈ కోర్సుల్లో బ్యాచిలర్ డిగ్రీ పూర్తి చేసిన వారెవరైనా ప్రవేశాలు పొందవచ్చన్నారు.తరగతులు సాయంత్రం వేళల్లో ఉండనున్న నేపథ్యంలో పీజీ చదువుతున్న విద్యార్థులు. పరిశోధకులు సైతం ఈ కోర్సుల్లో ప్రవేశాలు పొందవచ్చన్నారు. వివరాలకు విశ్వవిద్యాలయ వెబ్‌సైట్‌లో సంప్రదించాలని కోరారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ



ట్రోఫీని అందుకుంటున్న గుర్రప్ప, ప్రతాప్‌రెడ్డిల

కడప అగ్రికల్చర్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సహకారం బ్యాంకు లిమిటెడ్ విజయవాడ వారి ఆధ్వర్యంలో రాష్ట్రంలోని 13 డీసీసీ బ్యాంకులు.. వాటి పరిధిలోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల సిబ్బందికి రాష్ట్రస్థాయి షటిల్ బ్యాడ్మింటన్ పోటీలను నిర్వహించారు. విజయవాడలోని చెన్నుపాటి రామకోటయ్య ఇండోర్ స్టేడియంలో ఫిబ్రవరి 11న ఆప్కాబ్ స్పోర్ట్స్ రిక్రియేషన్ క్లబ్ అమరావతి ఆధ్వర్యంలో జరిగిన పోటీల్లో కడప జిల్లా సహకార కేంద్ర బ్యాంకు తరపున ప్రాతినిధ్యం వహించిన డిప్యూటీ రిజిస్ట్రార్, ఓఎస్డీ గుర్రప్ప, డిప్యూటీ జనరల్ మేనేజర్ ఏటూరు ప్రతాప్‌రెడ్డిలు పురుషుల వెటరన్ విభాగంలో రన్నర్స్‌గా గెలుపొందారు.ఏపీ ప్రభుత్వ సహకార, వ్యవసాయం సెక్రటరీ డాక్టర్ బాబు ఐఏఎస్‌చేతుల మీదుగా వీరు ట్రోఫీ అందుకున్నారు. ఆప్కాబ్ చైర్‌పర్సన్ మల్లెల ఝాన్సీరాణి, సీఈఓ రాజేంద్రకుమార్ వారికి అభినందనలు తెలిపారు.

భద్రత.. భరోసా..

- శ్రామికులకు అండ ఈ-శ్రమ్
- నమోదు చేసుకుంటే ఎంతో మేలు
- భవన నిర్మాణ, అసంఘటిత రంగ కార్మికులకు గుర్తింపు
- క్షేత్ర స్థాయిలో అవగాహన కల్పిస్తున్న అధికారులు





కార్మికులకు ఈ-శ్రమ్‌పై అవగాహన కల్పిస్తున్న, అధికారులు(ఫైల్)

కడప కోటిరెడ్డిసర్కిల్: కేంద్ర ప్రభుత్వ పర్యవేక్షణలోని ఈ–శ్రమ్ పథకం శ్రామిక జనావళికి ఆసరాగా నిలుస్తోంది. వీరితోపాటు భవన నిర్మాణ, అసంఘటితరంగ కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో అందజేసే గుర్తింపు కార్డుల ద్వారా వారు సంక్షేమ లబ్ధిని పొందనున్నారు. క్షేత్ర స్థాయిలోని కార్మికుల వివరాలను నమోదు చేసేందుకు కార్మికశాఖ కృషి చేస్తోంది.

ప్రయోజనాలు ఇవీ..

కార్మికులకు గుర్తింపు కార్డును జారీ చేస్తారు. దీంతో వారి కుటుంబానికి సామాజిక భద్రత ఉంటుంది. కార్డు కలిగిన వారికి రూ. 2 లక్షల ప్రమాద బీమా, పనిలో ఉండగా వైకల్యం కలిగితే రూ. లక్ష ఆర్థికసాయం అందిస్తారు. మరోవైపు విపత్తుల కాలంలో శ్రామికులను ఆదుకునేందుకు చర్యలు తీసుకుంటారు. వృత్తి నైపుణాభివృద్ధి, ఉపాధి అవకాశాలు పొందేందుకు ఈ కార్డు ఉపకరిస్తుంది. అసంఘటిత రంగ కార్మికులు సామాజిక భద్రతా చట్టం కింద ప్రయోజనాలు పొందేందుకు నమోదు అవసరం. అలాగే నేరుగా లబ్దిదారుని ఖాతాకు జమ చేసే వీలుంటుంది.

నమోదు ఎలా చేసుకోవాలంటే..

కార్మికుడు ఈ పోర్టల్‌లో నమోదు చేసుకునేందుకు రుసుం చెల్లించాల్సిన అవసరం లేదు. వారు ఉచితంగా వివరాలు నమోదు చేసి యూనివర్సల్ ఖాతా గుర్తింపు కార్డును జారీ చేస్తారు. సమీపంలోని వార్డు, గ్రామ సచివాలయం, సీఎస్‌సీ సెంటర్లలో నమోదు చేసుకోవచ్చు. కార్మికుని ఆధార్‌కార్డు, బ్యాంకు అకౌంట్ వివరాలను చెప్పాల్సి ఉంటుంది. కార్మికుడు ఎవరి వద్ద పనిచేస్తున్నాడో వాటిని వెల్లడించాల్సిన అవసరం లేదు. ఏ వృత్తి చేస్తున్నాడో చెబితే సరిపోతుంది. ఈ–శ్రమ్ కార్డు ఒకసారి నమోదు చేసుకుంటే చాలు...అది జీవితకాలం వర్తిస్తుంది. భవన నిర్మాణ అసంఘటితరంగ కార్మికులకు ఐదేళ్లకు ఒకసారి రెన్యూవల్ చేసుకోవాలి. మరోవైపు రెండు కాన్పుల వరకు రూ. 20 వేలు ఇస్తారు.

అర్హులు ఎవరంటే..

18–59 సంవత్సరాల మధ్య వయస్సుగల భవన నిర్మాణ, వలస కార్మికులు, ఇంటి పనివారు, వ్యవసాయ కూలీలు, చిన్న సన్నకారు, కౌలు రైతులు, మత్స్యకారులు, పశు పోషకులు, తోటపని, వండ్రంగి, ఇటుకబట్టీల కార్మికులు, వీధి వ్యాపారులు, ఆటో రిక్షా కార్మికులు, అంగన్వాడీ, ఆశా వర్కర్లు, షాపుల్లో పనిచేసే సిబ్బంది, ఈఎస్ఐ, పీఎఫ్ పొందే అర్హత లేని వారు ఈ పథకానికి అర్హులు.

వివరాలు నమోదు చేసుకోవాలి



జిల్లాలోని భవన నిర్మాణ, అసంఘటితరంగ కార్మికులు ఈ–శ్రమ్ పోర్టల్‌లో తమ వివరాలు నమోదు చేసుకోవాలి. దీనివల్ల అనేక ప్రయోజనాలు ఉన్నాయి. ఈ విషయమై కార్మికులకు అవగాహన కార్యక్రమాలను నిర్వహించాం. కార్మికులు తమ వివరాలు నమోదు చేసుకోవాలి.
– శ్రీకాంత్‌నాయక్, జిల్లా కార్మికశాఖ అధికారి

ఈ-శ్రమ్ ప్రయోజనకరం



మాలాంటి కార్మికులకు ఈ–శ్రమ్ పోర్టల్‌లో నమోదు చేసుకుంటే అనేక ప్రయోజనాలు ఉన్నాయి. ఏదైనా ప్రమాదం జరిగినపుడు బాధిత కుటుంబానికి ఆర్థిక ఆసరా లభిస్తుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న ఈ పథకానికి అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలి. – బి.నాగరంగన్న, కార్మికుడు, కడప

సింహంపై నరసింహుడు

వైభవంగా కడప రాయుని బ్రహ్మోత్సవాలు



సింహవాహనంపై నుంచి భక్తులను కటాక్షిస్తున్న స్వామివారు

కడప కల్చరల్: కడప రాయుడు శ్రీ లక్ష్మి వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు వైభవోపేతంగా కొనసాగుతున్నాయి. అరాచకాలు సృష్టిస్తున్న దుష్టులను అంతం చేసి శిష్ట రక్షణ చేసేందుకు దేవదేవుడు నరసింహుడై గర్జించాడు. శత్రువులను తునియలు చేసేందుకు విక్రమించాడు. ఆయుధ ధారియై పరాక్రమంతో వెళుతున్న ఆ పురుషోత్తముడిని చూసి భక్తులు తన్మయులయ్యారు. బ్రహ్మోత్సవాలలో భాగంగా సోమవారం చిన్న శేష వాహనంపై మాడవీధుల్లో విహరించారు. వాహన సేవ అనంతరం స్వామి, అమ్మవార్లకు శాస్త్రోక్తంగా స్నపన తిరుమంజన సేవ చేశారు. రాత్రి ఆలయ ప్రాంగణంలో కనుల పండువగా ఏర్పాటు చేసిన ఊయలపై సేద తీర్చారు. మంగళ వాయిద్యాలు, గాయకుల కమ్మని సంగీతం వింటూ స్వామి వింజామర సేవల మధ్య విశ్రమించారు. అనంతరం సింహంపై కడప రాయుడు నరసింహునిగా కొలువుదీరి భక్తులను కరుణించాడు. మహిళా భక్తబృందాలు పురుష బృందాలతో పోటీపడుతూ కోలాటాలు, భజనలు నిర్వహించారు. ప్రత్యేక వాయిద్య బృందాలు స్వామిని కీర్తిస్తూ సంగీతార్చన చేస్తూ ఊరేగింపుగా సాగారు.

- బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం ఉదయం కల్పవృక్ష వాహనంపై స్వామి తిరుమాడవీధుల్లో భక్తులకు దర్శనభాగ్యం కల్పించనున్నారు. ఉదయం 10.30 గంటలకు స్నపన తిరుమంజనం, సాయంత్రం 6.00 గంటలకు ఊంజలసేవ, అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారుల కీర్తనల ఆలాపనలు నిర్వహిస్తారు. రాత్రి 8.00 గంటల నుంచి స్వామిని హనుమంతవాహనంపై ఊరేగించనున్నారు.



స్వామి వారి గ్రామోత్సవంలో పాల్గొన్న భక్తులు

సార్వత్రిక ఎన్నికలకు సిద్ధం కావాలి

జిల్లా ఎస్పీ సిద్ధార్థ కౌశల్



మాట్లాడుతున్న ఎస్పీ సిద్ధార్థ కౌశల్

ప్రొద్దుటూరు క్రైం: రానున్న సార్వత్రిక ఎన్నికలకు పోలీసు అధికారులు, సిబ్బంది సన్నద్ధం కావాలని జిల్లా ఎస్పీ సిద్ధార్థ కౌశల్ తెలిపారు. ఎలాంటి ఘటనలకు తావులేకుండా ముందస్తు ప్రణాళికతో బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. పోలీసు అధికారులు, సిబ్బందికి శిక్షణా కార్యక్రమంలో భాగంగా ప్రొద్దుటూరులోని ఐఎంఏ హాల్‌లో సోమవారం నియోజకవర్గంలోని పోలీసు అధికారులకు ఎస్పీ దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్యాత్మక ప్రాంతాలు, పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. గత ఎన్నికల్లో నేరాలకు పాల్పడిన వారిపై ప్రత్యేక నిఘా ఉంచాలని ఆదేశించారు. మద్యం, నగదుతో ఓటర్లను ప్రలోభ పెట్టే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ట్రబుల్ మాంగర్లు, రౌడీషీటర్ల కదలికలపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. గ్రామాల ప్రజలతో సత్సంబంధాలు పెంపొందించుకొని సమస్యల గురించి ముందస్తు సమాచారం సేకరిస్తుండాలని సూచించారు. ఏదైనా సంఘటన జరిగినప్పుడు వెంటనే ఉన్నతాధికారులకు తెలియచేయాలన్నారు. ఎన్నికలు ముగిసే వరకు ప్రతి ఒక్కరూ పూర్తి స్థాయిలో శ్రమించాలన్నారు. ప్రశాంతంగా ఎన్నికలు జరగడానికి అందరూ కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రొద్దుటూరు డీఎస్పీ మురళీధర్, సీఐలు, ఎస్ఐలు, సెక్టార్ పోలీస్ ఆఫీసర్లు, ఎలక్షన్ సెల్ అధికారులు పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన ప్రొద్దుటూరు నియోజకవర్గంలోని సీఐలు, ఎస్ఐలు, సిబ్బంది

అర్జీలను సత్వరం పరిష్కరించాలి

కలెక్టర్ విజయరామరాజు



అర్జీలను పరిశీలిస్తున్న కలెక్టర్ విజయరామరాజు

కడప సెవెన్‌రోడ్స్: 'స్పందన', 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమాల ద్వారా అందే అర్జీలకు సత్వర పరిష్కారం చూపాలని కలెక్టర్ విజయ రామరాజు అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో ప్రజా ఫిర్యాదుల స్వీకరణ 'స్పందన' కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి కలెక్టర్‌తోపాటు జేసీ గణేష్ కుమార్, డిప్యూటీ కలెక్టర్ ప్రత్యూష హాజరై ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఫిర్యాదులను అధికారులు క్షేత్ర స్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేయాలన్నారు. కార్యక్రమంలో సీపీఓ వెంకట రావు, ఆర్అండ్‌బీ ఎస్ఈ మహేశ్వర్ రెడ్డి, పంచాయతీరాజ్ ఎస్ఈ శ్రీనివాస రెడ్డి, డీఆర్డీఏ పీడీ ఆనంద్ నాయక్, ఆర్ డబ్ల్యూఎస్ ఎస్ఈ వీరన్న, జిల్లా వ్యవసాయ అధికారి జేడీ నాగేశ్వరరావు, హౌసింగ్, డ్వామా పీడీలు కృష్ణయ్య, యదుభూషణ్‌రెడ్డితో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఫారం–6, 7, 8 అర్జీలను పెండింగ్ లేకుండా పూర్తి చేయాలి

ఓటర్ల జాబితాకు సంబంధించి ఫారం–6, 7, 8 అర్జీల పెండెన్సీలను నిర్దేశిత గడువులోపు పూర్తి చేయాలని కలెక్టర్ విజయరామరాజు అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లోని బోర్డ్ రూమ్ హాలులో ప్రయారిటీ బిల్డింగ్స్, కాస్ట్ సర్వే, ఆరోగ్య సురక్ష సర్వే ,పెండింగ్ ఫారంలు, ఆరోగ్య శ్రీ కార్డ్స్, పంచాయతీ సెక్రటరీలు వివిధ సంక్షేమ పథకాలపై జేసీ గణేష్ కుమార్, నగర కమిషనర్ ప్రవీణ్ చంద్, డిప్యూటీ కలెక్టర్ ప్రత్యూషలతో కలిసి మండల అధికారులతో కలెక్టర్ వీసీ ద్వారా సమీక్ష చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ఎలాంటి అలసత్వం వహించకుండా ప్రజలకు అందించాలన్నారు. అలాగే ప్రయారిటీ బిల్డింగ్స్ సంబంధించి స్టేజ్ కన్వర్షన్లను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఓటర్ల జాబితాకు సంబంధించి అన్ ప్రాసెస్డ్ అర్జీలను పెండింగ్ లేకుండా ఏ రోజుకు ఆరోజు బీఎల్‌ఓలకు అలకేట్ చేసి వాటిని పూర్తి చేయాలన్నారు. ఆరోగ్య సురక్ష సర్వే లో ఎలాంటి పెండింగ్ లేకుండా పంచాయితీ, సచివాలయాల్లో త్వరితగతిన పూర్తి చేయించాలన్నారు. అలాగే సచివాలయాల్లో పంచాయతీ సెక్రటరీ వలంటీర్ల అటెండెన్స్ పై ఆరా తీశారు. విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో కడప, జమ్మలమడుగు ఆర్డీఓలు మధుసూధన్, శ్రీనివాసులు, ఈఆర్ఓ కౌసర్ భాను, హౌసింగ్ పీడీ కృష్ణయ్య, డీఎస్పీ షరీఫ్, డ్వామా పీడీ యదుభూషణ్ రెడ్డి, డీఆర్డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ ఆనంద్ నాయక్, సీపీఓ వెంకటరావు, పీఆర్ ఎస్ఈ శ్రీనివాసులురెడ్డి, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మండల అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, తహశీల్దార్లు, ఎంపిడివోలు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు హాజరయ్యారు.

చెరువు మెరిసె.. ప్రజలు మురిసె

- చింతమాకులపల్లె చెరువుకు జాతీయ స్థాయిలో పేరు
- అమృత్ సరోవర్ కింద బెస్ట్‌గా గుర్తింపు



చెరువులో చేరిన వర్షపు నీరు

కురబలకోట: అన్నమయ్య జిల్లా కురబలకోట మండలంలోని చింతమాకులపల్లె సచివాలయ పరిధిలోని నార్లపల్లె దగ్గరున్న చాకిరేవు చెరువుకు జాతీయ స్థాయిలో గుర్తింపు లభించింది. ఏడాది క్రితం ఈచెరువులో అమృత్ సరోవర్ కింద ఉపాధి హామీ పథకం ఆధ్వర్యంలో నీటి నిల్వ సంరక్షణ అభివృద్ధి పనులు రూ. 6లక్షలతో చేపట్టారు. అదిప్పుడు సత్ఫలితాలు ఇవ్వడంతో జాతీయ స్థాయిలో గుర్తింపు లభించింది. ఇందులో భాగంగా సోమవారం న్యూఢిల్లీలో జరిగిన సెమినార్‌లో స్థానిక ఎంపీడీఓ దిలీప్‌కుమార్ చెరువు సత్ఫలితాల గురించి ప్రజంటేషన్ ఇచ్చారు. ఉపాధి హామీ కమిషనర్ చిన్నతాతయ్య కూడా ఈ సందర్భంగా జరిగిన సెమినార్‌లో పాల్గొన్నారు. ఏడాది కిందట ఈచెరువును అమృత సరోవర్ పథకం కింద చేపట్టడం జరిగిందని ఎంపీడీఓ ప్రజంటేషన్‌లో వివరించినట్లు తెలిపారు. అప్పట్లో ముళ్లపొదలతో నిండి పెద్దగా నీరు చేరని పరిస్థితి ఉండేది. వీటన్నింటిని తొలగించారు. పూడిక తీశారు. ట్రెంచీలు కొట్టారు. బౌండరీల నిర్మాణం, చెరువు సరిహద్దు మేర మొక్కల పెంపకం, వర్షపు నీరు చెరువుకు చేరేలా చర్యలు చేపట్టారు. దీంతో ఎప్పుడూ వర్షాలకు పెద్దగా నిండని ఈచెరువు ఇటీవల కురిసిన వర్షాలకు ఆశాజనకంగా నీళ్లు చేరాయి. పశుపక్ష్యాదులతో పాటు మూగ జీవాలకు తాగునీటి కొరత తీరింది. ఆయకట్టుకు సాగునీరు లభ్యమైంది. పరీవాహక ప్రాంతాల్లో భూగర్భ జలాలు పెరిగాయి. కూలీలకు ఉపాధిగా పని లభించింది. చెరువు రూపురేఖలు మారడంతో పాటు చెరువును ఆధునికీకరించారు. పాత చెరువు కొత్తగా మారడంతో రైతులతో పాటు గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారని సెమినార్‌లో ప్రజంటేషన్ ఇచ్చినట్లు ఎంపీడీఓ దిలీప్‌కుమార్ వివరించారు. రాష్ట్రం నుంచి ఏకైక బెస్ట్ చెరువుగా జాతీయ స్థాయిలో గుర్తింపుతో పాటు ఆపై కురబలకోట మండలానికి సంబంధించిన చెరువు కావవడం గర్వంగా ఉందని తెలిపారు.



చెరువు సత్ఫలితాలపై న్యూఢిల్లీ సెమినార్‌లో ఎంపీడీఓ ప్రజంటేషన్

ఎంతో సంతోషంగా ఉంది



అమృత సరోవర్ పథకం కింద చింతమాకుపల్లె చెరువు అభివృద్ధి చెందడం ఆపై రాష్ట్రం నుండి బెస్ట్ చెరువుగా జాతీయ స్థాయిలో గుర్తింపు లభించడం గర్వకారణం. నీటి సంరక్షణ చర్యలకు ఈ చెరువు స్ఫూర్తిదాయకంగా.. మోడల్‌గా నిలవడం సంతోషకరం. పాత చెరువు పునరుద్ధరిచడంతో ఆప్రాంత రైతులకు ఎంతో ఉపయోగకరంగా మారింది.
–బి. దస్తగిరి, ఎంపీపీ, కురబలకోట మండలం

గండికోట అడ్వెంచర్ స్పోర్ట్స్ అకాడమీతో వైవీయూ ఎంఓయూ



ఒప్పంద పత్రాలను చూపుతున్న అధికారులు

వైవీయూ: యోగివేమన విశ్వవిద్యాలయం హిస్టరీ అండ్ ఆర్కియాలజీ శాఖ గండికోట అడ్వెంచర్ స్పోర్ట్స్ అకాడమీతో ఎంఓయూ (మెమరాండం ఆఫ్ అండర్ స్టాండింగ్) కుదుర్చుకుంది. ఈ మేరకు విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్ సమక్షంలో రిజిస్ట్రార్ ఆచార్య వై.పి. వెంకటసుబ్బయ్య గండికోట అడ్వెంచర్ స్పోర్ట్స్ అకాడమీ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ బి. శేఖర్, ఇన్‌స్ట్రక్టర్ జస్వంత్ ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు.దీనివల్ల అడ్వెంచర్ టూరిజం, స్పోర్ట్స్ టూరిజం, హాస్పిటాలిటీ, మార్కెటింగ్, అడ్మినిస్ట్రేషన్లలో ఇంటర్న్ షిప్ వైవీయూ విద్యార్థులకు లభిస్తుందని ఇన్‌ఛార్జ్ ప్రిన్సిపల్ ఆచార్య పి.ఎస్. షావల్లీ ఖాన్ తెలిపారు.. ఆ కాలానికి స్టయిఫైండ్ కూడా ఇస్తారన్నారు.కార్యక్రమంలో ఆచార్య ఏజీ దాము, డా. ఎల్.సుబ్రమణ్యంశర్మ, అడ్వెంచర్ స్పోర్ట్స్ అకాడమీ ప్రతినిధులు మురళి, వైవీయూ హిస్టరీ అండ్ ఆర్కియాలజీ శాఖ అధ్యాపకులు డా.వెంకటరమణ, డా.హేమమంజరి పాల్గొన్నారు.

క్లుప్తంగా

పెండింగ్ పనులు పూర్తి చేయాలి



కడప రైల్వేస్టేషన్‌ను పరిశీలిస్తున్న గుంతకల్లు డీఆర్‌ఎం వినీత్‌సింగ్

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప రైల్వేస్టేషన్‌లో జరుగుతున్న పనులను సకాలంలో పూర్తి చేయాలని గుంతకల్లు డీఆర్‌ఎం వినీత్‌సింగ్ ఆదేశించారు. ఇటీవల గుంతకల్లు డీఆర్‌ఎంగా బాధ్యతలు స్వీకరించిన ఆయన సోమవారం కడప రైల్వేస్టేషన్‌ను, అక్కడ జరుగుతున్న పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అమృత్‌భారత్ స్టేషన్ ప్రాజెక్టులో భాగంగా జరుగుతున్న పనులను పరిశీలించామని తెలిపారు. కడప రైల్వేస్టేషన్‌లో నూతన భవనాల నిర్మాణాలకు సంబంధించి వాటి వివరాలను ఇంజనీరింగ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ డీసీఎం మనోజ్, సీనియర్ డీఎంఒ శ్రావణ్‌కుమార్, సీనియర్ డీఎస్‌టీఈ వైపీ సింగ్, సీనియర్ డీఈఈ గంగరాజు, ఇన్‌చార్జి రైల్వేస్టేషన్ మేనేజర్ రాజీవ్‌సింహా, సీనియర్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ జనార్దన్, చీఫ్ టిక్కెట్ ఇన్‌స్పెక్టర్ ఉమర్‌బాషా, ఏడీఈఎన్ రాధాకృష్ణ, ఏడీ ఎస్‌టీఈ కాత్యాకుమార్, ఆర్‌పీఎఫ్ సీఐ శ్రీనివాసులు, ఎస్‌ఐ శంకర్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.

‘పుట్టా’ బంధువులా.. మజాకా..!



వివాదాస్పద స్థలంలో విల్లాస్ నిర్మించేందుకు చదును చేసిన దృశ్యం

- వివాదాస్పద స్థలంలో విల్లాస్ నిర్మాణానికి భూమిపూజ
- పాల్గొన్న టీడీపీ ఇన్‌చార్జి పుట్టా సుధాకర్ యాదవ్

ప్రొద్దుటూరు : దాదాపు రూ.30 కోట్ల విలువైన వివాదాస్పద స్థలంలో తమ బంధువులు నిర్మించనున్న విల్లాస్ నిర్మాణానికి మైదుకూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి పుట్టా సుధాకర్ యాదవ్ ఆదివారం భూమి పూజ చేయడం చర్చనీయాంశంగా మారింది. ప్రొద్దుటూరు పట్టణ పరిధిలోని రింగ్‌రోడ్డులో ఉన్న సర్వే నంబర్ 613, 616 -1ఏ లో రిటైర్డు ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ ఆర్‌ఎస్‌వీ బద్రినాథ్ స్థలం ఉండేది. మొత్తం రెండు సర్వే నంబర్లలో 6.64 ఎకరాల భూమి ఉండేది. మదూరురోడ్డుకు సమీపంలో రింగ్ రోడ్డుకు పక్కనే ఉన్న ఈ భూమి విలువ ఎకరా రూ.10 కోట్లకు పైగానే పలుకుతోంది. ఆయన 2006లో విశాఖపట్నంలో అసిస్టెంట్ కమిషనర్‌గా పని చేస్తున్న సమయంలో ప్రొద్దుటూరుకు చెందిన కొంత మంది మీ భూమిని ఇతర కులాలకు చెందిన వారు ఆక్రమించుకుంటున్నారని అమ్మితే కొనుగోలు చేస్తామని తెలిపారు. ముగ్గురు వ్యక్తులు ఈ మేరకు బద్రినాథ్‌తో చర్చలు జరిపి సెంటు రూ.లక్ష చొప్పున 5 ఎకరాలు రూ.5 కోట్లకు కొనుగోలు చేసేందుకు ఒప్పందం చేసుకున్నారు. ఆ స్థలం రిజిస్ట్రేషన్ కూడా జరిగింది. ఈ స్థలంపై మళ్లీ అమ్మకాలు, కొనుగోలు జరిగాయి.

బద్రినాథ్ కుటుంబ సభ్యులు కోర్టులో కేసు

బద్రినాథ్ కుమారుడు రాజారఘునాథ్, కుమార్తెలు వైష్ణవి, వినీత ఈ స్థలం అమ్మకం విషయంపై కోర్టులో కేసు వేశారు. ఇది తమ పూర్వీకుల ఆస్తి అని, వారసత్వంగా ఇందులో తమకు వాటా వస్తుందని, 2009లో కోర్టులో కేసు వేయగా 20/2011లో రిజిస్టర్ అయింది. అప్పటి నుంచి ప్రొద్దుటూరులోని రెండో అదనపు జిల్లా జడ్జి కోర్టులో కేసు నడుస్తోంది. ఇంకా తుది తీర్పు వెలువడలేదు. ఇది ఇలా ఉండగా ఈ స్థలం కొనుగోలు చేసిన వారిలో కొంత మంది హైదరాబాద్‌కు చెందిన ఎంఎల్‌ఎస్ ఇన్‌ఫ్రా డెవలపర్స్‌తో కలసి విల్లాస్ నిర్మించేందుకు ఏర్పాట్లు చేశారు. ఇందులో భాగంగా ఆదివారం మైదుకూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి పుట్టా సుధాకర్ యాదవ్ విల్లాస్ నిర్మించేందుకు భూమి పూజ చేశారు. ఈ స్థలం విషయంపై కోర్టులో కేసు నడుస్తుండగానే నిర్మాణానికి భూమి పూజ చేయడం జరిగింది. గతంలో కూడా రియల్ ఎస్టేట్ ప్రముఖులు ఈ స్థలాన్ని కొనుగోలు చేయాలని ప్రయత్నించి, కోర్టులో వ్యాజ్యం నడుస్తుండటంతో వెనక్కి వెళ్లారు.



విల్లాస్ నిర్మాణ భూమిపూజ కార్యక్రమంలో పాల్గొన్న టీడీపీ ఇన్‌చార్జి పుట్టా సుధాకర్ యాదవ్

■ ఈ విషయంపై ఎంఎల్‌ఎస్ ఇన్‌ఫ్రా ఎండీ పెరుగు నారాయణ యాదవ్‌ను ‘సాక్షి’ వివరణ కోరగా నిబంధనల ప్రకారం బద్రినాథ్ ఆ స్థలాన్ని 13 మందికి అమ్మినట్లు రికార్డులు ఉన్నాయన్నారు. రిజిస్ట్రర్లలో సంతకం చేసిన తర్వాత ఆస్తి తమది అంటే ఎలా అవుతుందన్నారు. ఏవైనా అభ్యంతరాలు ఉంటే తనకు స్వయంగా తెలిపితే పరిశీలిస్తానన్నారు.

మాస్టర్ కీతో బైక్‌ల మాయం

- ద్విచక్ర వాహనాల దొంగ అరెస్ట్
- 21 టీవీఎస్ ఎక్సెల్ బైక్‌లు స్వాధీనం



రికవరీ చేసిన టీవీఎస్ ఎక్సెల్ మోటార్ బైక్‌లను పరిశీలిస్తున్న ఎస్పీ సిద్దార్థ కౌశల్, డీఎస్పీ మురళీధర్

ప్రొద్దుటూరు క్రైం : అతని కన్ను పడితే బైక్ మాయం కావాల్సిందే. ఇలా ఏకంగా 21 ద్విచక్ర వాహనాలను దొంగలించాడు. అయితే అతని సీరియల్ చోరీలకు ప్రొద్దుటూరు త్రీ టౌన్ పోలీసులు బ్రేక్‌లు వేశారు. మోటార్ బైక్‌లను చోరీ చేసిన అంకయ్య అనే వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలను జిల్లా ఎస్పీ సిద్దార్థ కౌశల్ సోమవారం డీఎస్పీ మురళీధర్‌తో కలిసి త్రీ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో మీడియాకు వెల్లడించారు. దువ్వూరులోని అశోక్‌నగర్‌కు చెందిన బత్తల అంకయ్య గతంలో ఎలక్ట్రీషియన్ పని చేసేవాడు. అతను ఒంటరివాడు. గత కొన్ని రోజుల నుంచి ఎలక్ట్రీషియన్ పని చేయడం మానుకున్నాడు. ప్రతి రోజు ప్రొద్దుటూరుకు వచ్చి రాత్రి అయ్యేసరికి తిరిగి దువ్వూరుకు వెళ్లేవాడు. అంకయ్యకు షుగర్ వ్యాధి ఉంది. రోజు వారి ఖర్చుల తోపాటు మందులకు డబ్బు లేకపోవడంతో ఏం చేయాలో పాలుపోలేదు. ఈ క్రమంలో అతను ఒక మాస్టర్ కీ తయారు చేయించుకొని పార్క్ చేసిన టీవీఎస్ ఎక్సెల్ బైక్‌ను చోరీ చేశాడు. ఇలా అంకయ్య మాటు వేసి.. బైక్‌లను పార్క్ చేసి వెళ్లిన మరుక్షణమే అపహరించి తీసుకెళ్లేవాడు. భారీ మోటార్ బైక్‌ల లాక్ తీయడం కష్టమని భావించిన అతను మాస్టర్ కీ తయారు చేసుకొని టీవీఎస్ ఎక్సెల్ బైక్‌లను మాత్రమే ఎత్తుకెళ్తున్నాడు.

కొట్టేసిన బైక్‌లు చౌకగా విక్రయం

చోరీ చేసిన ద్విచక్ర వాహనాలను రూ.10 వేలు, రూ.5 వేలు చొప్పున అతను విక్రయించేవాడు. తన స్వస్థలమైన దువ్వూరులో ఎక్కువ బైక్‌లను విక్రయించాడు. చాపాడు మండలంలోని వరదాయపల్లెకు చెందిన గొర్ల ఈశ్వరయ్య తన బైక్ కనిపించక పోవడంతో త్రీ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. విచారణలో భాగంగా త్రీ టౌన్ సీఐ వెంకటరమణ సిబ్బందితో కలిసి నిందితుడు అంకయ్యను అరెస్ట్ చేశారు. అతని వద్ద నుంచి 21 మోటార్ బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో ఉత్తమ ప్రతిభ కనబరచిన సీఐ వెంకటరమణ, కానిస్టేబుళ్లు తిరుమలయ్య, దస్తగిరితోపాటు హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసులు, కానిస్టేబుళ్లు లక్ష్మీకాంత్‌రెడ్డి, ధనాంజనేయలను ఎస్పీ అభినందించారు.

హోటల్‌లో గ్యాస్ సిలిండర్లు స్వాధీనం

చింతకొమ్మదిన్నె : కడప రీజినల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి షేక్ మాసుంబాషా ఆదేశాల మేరకు చింతకొమ్మదిన్నె మండలం కృష్ణాపురం రోడ్డులో గల ఓ హోటల్‌లో అధికారులు ఆకస్మికంగా తనిఖీ నిర్వహించి నిబంధనలకు విరుద్ధంగా వినియోగిస్తున్న ఐదు వంట గ్యాస్ సిలిండర్లను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం వాటిని పెండ్లిమర్రిలోని గంగ ఇండేన్ ఏజెన్సీ వారికి అప్పగించారు. అనంతరం హోటల్ యజమానిపై కేసు నమోదు చేశారు. ఈ తనిఖీల్లో విజిలెన్స్ అధికారులు ఇదురుబాషా, బాల గంగాధర్‌రెడ్డి, సౌజన్య, జనార్ధన్‌రావు, రంతుబాషా తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిక

మైదుకూరు : మండల పరిధి అన్నలూరు పంచాయతీలోని చౌటపల్లె గ్రామంలో టీడీపీ నుంచి 50 కుటుంబాల వారు ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. ఈ సందర్భంగా గ్రామంలో ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి, ఆయన తనయుడు వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త నాగిరెడ్డిలకు టీడీపీ కార్యకర్తలు బాణసంచాతో ఘన స్వాగతం పలికారు. అనంతరం గ్రామంలో టీడీపీ నాయకుడు అచ్చుకట్ల కరీముల్లా ఆధ్వర్యంలో అల్లా బకాష్ గారి అమీర్ బాషా, షేక్ షరీఫ్, దావూద్ సాహెబ్ గారి జాఫర్, చింతకుంట పెద్ద హుస్సేన్ పీరా, నడిపి హుస్సేన్ పీరా, బద్వేలు మాబుసాహెబ్, అల్లా బకాష్ గారి ఖాసీంవలి, ఫక్ళుద్దీన్, షేక్ సిద్ధిక్, పర్వేజ్, దావూద్ సాహెబ్ గారి రియాజ్, అఫ్రిద్, చింతకుంట మౌలాలి, ఆలం తదితర 50 కుటుంబాల వారికి ఎమ్మెల్యే రఘురామిరెడ్డి, నాగిరెడ్డి వైఎస్సార్‌సీపీ కండువాలు వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో ఏపీఐఐసీ డైరెక్టర్ డి.గంగాదర్ రెడ్డి, వక్ఫ్‌బోర్డు జిల్లా చైర్మన్ మదీనా దస్తగిరి, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీమన్నారాయణరెడ్డి, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు అచ్చుకట్ల కరీముల్లా, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు ఏవీ సుబ్బారెడ్డి, మండల కన్వీనర్ గల్లా నరసింహారెడ్డి, అన్నలూరు సర్పంచ్ ఎం.శ్రీనివాసులురెడ్డి, మైనారిటీ నాయకులు ముజఫర్, ట్రాక్టర్ గౌస్, ఖాదర్ తదితరులు పాల్గొన్నారు.



మైదుకూరు : ఎమ్మెల్యే రఘురామిరెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ కార్యకర్తలు



పులివెందుల టౌన్ : వైఎస్సార్‌సీపీలోకి చేరిన టీడీపీ సానుభూతిపరులతో వైఎస్ మనోహర్‌రెడ్డి

వైఎస్సార్‌సీపీలోకి టీడీపీ సానుభూతిపరులు

పులివెందుల టౌన్ : స్థానిక ఎర్రగుడిపల్లెలోని టీడీపీ సానుభూతిపరులు సోమవారం మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, సివిల్ సప్లయ్ రాష్ట్ర డైరెక్టర్ హాలు గంగాధరరెడ్డిల సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. వీరికి మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి పార్టీ కండువాలు వేసి వైఎస్సార్‌సీపీలోకి ఆహ్వానించారు. నారిగాళ్ల నరసింహులు, కుళ్లాయప్ప, పెద్ద నరసింహులు సంబంధించిన కుటుంబాల వారు వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ పురుషోత్తం, వైఎస్సార్‌సీపీ నాయకులు డేనియల్ బాబు, సూరి, నరసింహులు, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు ప్రాంతాల్లో రైలు కింద పడి ఇద్దరు మృతి

కడప కోటిరెడ్డి సర్కిల్ : వేర్వేరు ప్రాంతాల్లో రైలు కింద పడి ఇద్దరు మృతి చెందారు. కడప- భాకరాపేట రైల్వే స్టేషన్ల మధ్య గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందినట్లు కడప రైల్వే హెడ్ కానిస్టేబుల్ నాయక్ తెలిపారు. గూడ్స్ రైలు కిందపడి వ్యక్తి మరణించారని ఆయన పేర్కొన్నారు. ఉదయాన్నే మృతదేహాన్ని రిమ్స్ పోలీస్‌స్టేషన్‌కు తరలించామని రైల్వే పోలీసులు తెలిపారు.



భాకరాపేట వద్ద గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

కడప – కనుములోపల్లి మధ్య..

కడప – కనుములోపల్లి రైల్వేస్టేషన్ల మధ్య ఎగురయ్యలు పట్టాలపై గుర్తు తెలియని వ్యక్తి గుర్తుతెలియని రైలు కింద పడి మృతి చెందినట్లు రైల్వే హెడ్‌కానిస్టేబుల్ అయూబ్ తెలిపారు. సుమారు 60 ఏళ్ల కలిగిన మగ వ్యక్తి సోమవారం సాయంత్రం రైలు కిందపడి చనిపోయారని పేర్కొన్నారు. చనిపోయిన వ్యక్తి వివరాలు తెలియనందువల్ల మృతదేహాన్ని రిమ్స్‌కు తరలించామని తెలిపారు. ఆచూకీ తెలిసిన వ్యక్తులు రైల్వే పోలీసులను సంప్రదించాలని ఆయన సూచించారు.

రేపు గండిలో టెండర్లు

చక్రాయపేట : గండి వీరాంజనేయస్వామి సన్నిధిలో తలనీలాలు, కొబ్బరి చిప్పలు, అన్నదాన కార్యక్రమానికి ప్రతి రోజు కాయగూరలు, పాలు పెరుగు తదితరాలకు బుధవారం షీల్డ్ టెండర్లు, బహిరంగ వేలం పాట నిర్వహిస్తున్నట్లు ఆలయ సహాయ కమిషనర్ అలవలపాటి ముకుందరెడ్డి తెలిపారు. ఏడాది పాటు భక్తులు సమర్పించే తలనీలాలు పోగు చేసుకొనే హక్కు పొందుటకు రూ.20 లక్షల ధరావత్తు చెల్లించి వేలం పాటలో పాల్గొనాలని ఆయన పేర్కొన్నారు. ఒక భాగం కొబ్బరి చిప్పలు సేకరించు కొను హక్కు పొందుటకు రూ.రెండు లక్షలు ధరావత్తు చెల్లించాలని చెప్పారు. ఆలయంలో జరిగే శాశ్వత నిత్యాన్నదాన పథకానికి కాయగూరలు, పాలు, పెరుగు సరఫరా చేయు హక్కు పొందుటకు రూ.10 వేల చొప్పున ధరావత్తు చెల్లించి షీల్డ్ టెండరు, వేలంపాటలో పాల్గొనవచ్చని చెప్పారు. పూర్తి వివరాలకు తమ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

యువకుడి అదృశ్యం

- తప్పించారా, తప్పిపోయాడా? • అనుమానం వ్యక్తం చేస్తున్న తల్లిదండ్రులు



రామ్మోహన్‌రెడ్డి (ఫైల్)

బ్రహ్మంగారిమఠం : మండలంలోని డి.నేలటూరు పంచాయతీ మలుగుడుపాడు గ్రామానికి చెందిన కుంచాల రామ్మోహన్‌రెడ్డి(28) అనే యువకుడు శుక్రవారం నుంచి కనిపించక పోవడంతో అతని తండ్రి పిచ్చిరెడ్డి పోలీసులకు సోమవారం ఫిర్యాదు చేశాడు. రామ్మోహన్‌రెడ్డి తండ్రి పిచ్చిరెడ్డి, ఎస్‌ఐ విద్యాసాగర్ తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మలుగుడుపాడు గ్రామానికి చెందిన పిచ్చిరెడ్డి, రామమలక్షుమ్మ దంపతులకు ఇద్దరు కుమారులు. రామ్మోహన్‌రెడ్డి చిన్న కుమారుడు. డిగ్రీ వరకు చదివి హైదరాబాదులో ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. 20 రోజుల క్రితం మలుగుడుపాడు వచ్చి ఇంటి దగ్గరనే ఉన్నాడు. ఈ నెల 9న శుక్రవారం సాయంత్రం బైక్ తీసుకొని బద్వేల్‌కు వెళ్తున్నట్లు ఇంట్లో ఉన్న తల్లికి చెప్పి పోయాడు. తిరిగి వస్తూ నందిపల్లెదగ్గర ఉన్న పెట్రోల్ బంక్‌లో రాత్రి 7.30కి పెట్రోల్ పట్టించుకొన్నట్లు అక్కడి సీసీ కెమెరా పుటేజీల్లో ఉంది. రాత్రి 7.50 సమయంలో రామ్మోహన్‌రెడ్డి వెంట రెండు బైక్‌లలో నలుగురు వ్యక్తులు వెంబడించినట్లు తెలుస్తోందని ఎస్‌ఐ తెలుపుతున్నాడు.పిచ్చిరెడ్డి మాత్రం గ్రామంలో తమకు ఇతరులకు కొన్ని సమస్యలు నడుస్తున్నాయని, వారే ఏదో చేసి ఉంటారని అనుమానం ఉన్నట్లు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పిచ్చిరెడ్డి ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. ఇప్పటికే అనుమానితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.

మద్యం బాటిళ్లు స్వాధీనం

కాశినాయన : మండలంలోని ఇటుగుల్లపాడు గ్రామానికి చెందిన రామయ్య అనే వ్యక్తి వద్ద నుంచి 105 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ అమర్‌నాథ్ రెడ్డి తెలిపారు. అతనిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ గ్రామాల్లో అక్రమ మద్యం, పేకాట తదితర అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. దాడుల్లో కానిస్టేబుళ్లు వెంకటసుబ్బయ్య, సుధీర్ పాల్గొన్నారు.

వల్లూరు : వల్లూరు బస్టాప్ సమీపంలో సోమవారం అక్రమ మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ వెంకట రమణ తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు తమ సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించి ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా మద్యాన్ని విక్రయిస్తున్న ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. అతని వద్ద నుంచి 41 బాటిళ్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ మేరకు అతనిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురికి గాయాలు

కొండాపురం : జిల్లాలోని వేర్వేరు ప్రాంతాల్లో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురికి గాయాలయ్యాయి. కొండాపురం మండల పరిధిలోని బుక్కపట్నం గ్రామానికి చెందిన వలంటీర్ చెన్నప్ప, అనిల్‌కుమార్ ద్విచక్ర వాహనంలో సోమవారం తాళ్లప్రొద్దుటూరుకు వెళ్తుండగా.. నూతన బైపాస్ రోడ్డు సాయి పల్లవి ఫంక్షన్ హాల్ సమీపంలో కడపకు వెళ్లే లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో వారిద్దరూ గాయపడ్డారు. బాధితులను ఆసుపత్రికి తరలించారు.

చాపాడు : మండల పరిధిలోని కడప – కర్నూలు జాతీయ రహదారిలో గల ద్వారకానగరం వద్ద ప్యాసింజర్ ఆటోను వెనక వైపు నుంచి కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో మైదుకూరు మున్సిపాలిటీ పరిధిలోని గడ్డమాయపల్లెకు చెందిన మన్నెం నడిపి సిద్దారెడ్డి అనే వృద్ధుడికి తీవ్ర గాయాలయ్యాయి. సిద్దారెడ్డి వ్యక్తిగత పని నిమిత్తం మైదుకూరుకు వచ్చి తిరిగి ఆటోలో వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. అలాగే ఆటోలో వెళుతున్న ఐదుగురికి స్వల్ప గాయాలు అయ్యాయి.

వాహన తనిఖీలో రూ.15 లక్షల స్వాధీనం

దువ్వూరు : ఎలాంటి పత్రాలు లేకుండా తరలిస్తున్న రూ.15 లక్షలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు. దువ్వూరు పోలీస్‌స్టేషన్‌లో ఆయన వివరాలు వెల్లడించారు. సోమవారం సాయంత్రం మండలంలోని ఇడమడక చెక్ పోస్టు వద్ద వాహన తనిఖీలు చేస్తుండగా కర్నూలు వైపు నుంచి వస్తున్న కారును తనిఖీ చేయగా డిక్కీలో రూ.15 లక్షలు ఎలాంటి పత్రాలు లేకుండా తరలిస్తుండటంతో ఆ డబ్బును స్వాధీనం చేసుకున్నామన్నారు. కారులో వెళుతున్న వ్యక్తిని విచారించగా తనపేరు జయప్రకాష్ అని తెలంగాణలోని వనపర్తి నుంచి చిత్తూరు జిల్లా కుప్పంకు డబ్బు తరలిస్తున్నట్లు చెప్పాడన్నారు. స్వాధీనం చేసుకున్న డబ్బును తిరుపతి ఇన్‌కాం ట్యాక్స్ అధికారులకు అప్పగించి, కేసు నమోదు చేశామని పేర్కొన్నారు.